సవతి తల్లిప్రేమ

శ్రీమతి పి. శేషమ్మగారు

౧

కాకినాడయందుఁగల న్యాయవాదులలో నారాయణరావుగారును యెన్నికగన్నవారు. మంచివారనియు, పరమశాంతులనియు, ఉదారహృదయులనియు వీరు పేరుగాంచిరి. చాల ఆస్తిగణించిరి. ధనమునార్జించిరి. మొన్న మొన్నటి దనుకను బహుఆనందముతో జీవయాత్రగడపుచుండిరి. కాని యెల్లప్పుడును మానవుని జీవితము ఒక్కరీతిని నడచుట దుర్లభముగదా! పేరునకు దగినరూపము—రూపమునకు దగినపేరు, రూపమునకూ పేరునకూ దగిన సుగుణసంపత్తి గలిగి, కాలధర్మమునొందిన సుందరియను నాతని ప్రథమకళత్రవియోగముతోనే నారాయణరావుజీవితవాహినియు వక్రగతికి రాఁదొడంగినది. విమల యనునది సుందరికిఁదనయ. నారాయణుని జీవితసర్వస్వమిపుడాబాలికయే. సుందరిసహధర్మచారిణీత్వమును మఱుపజాలని యతని మానసికప్రపంచము నావరించిన గాఢాంధకారము విరియఁజేయు విమలయే యిపుడు దివ్యజ్యోతియైయున్నది. ఇంటనున్నపుడొకనిముసమేనియు విమలను విడువకఁ దనచెంగటనునిచికొనుట—కార్యాంతరముల నిలువెడలినపుడెల్లను విమలవిషయమునే తలంచుచుండుట—నారాయణరావున కలవాటు. వేయేల! నారాయణరావు ప్రాణములే విమలస్వరూపమని చెప్పుట యతిశయోక్తికాఁజాలదు. సుందరీవియోగము విమలసంరక్షణము—ఈరెండును అతని హృదయగ్రంథిఁ బెనవైచికొని చాలసంకటములఁ గల్పించి యాతని జీవితమంతయు దుఃఖమయముగావింప నారంభించెను. ప్రేమ మిక్కుటముగ నున్నచోటఁ గీడును శంకించుట సహజము. విమలను విడిచి పరోక్షమున నున్నపుడెల్లను తల్లిలేనిబిడ్డ గావున నామె కెట్టి విపత్తుగలిగెనో యని నారాయణరావు చింతించుచుండును. మనమెంతచింతించి యేమిచేయఁగలము? సర్వరక్షకుఁడగు పరమేశ్వరుని విధానమెట్లున్నదో అటుల జరిగితీరును. కపటనాటకసూత్రధారియగు నాతఁ డేకర్మము జేసికొన్నవాని నాఫలము ననుభవింప నియమించియుండ నన్యథాప్రవర్తించుటెట్లు? నారాయణుఁడు, విమల తనతల్లినిగుఱించి బెంగపెట్టుకొనకుండను, ఆమె కెట్టి కొఱంతయును లేకుండను, శక్తివంచనలేక సంరక్షించుచుండెను. అహోరాత్రములామె యిష్టములనెరవేర్చుచూ, సంతసము గల్పించుమాటలుజెప్పుచు, తల్లిని మఱచునట్లు జేయుచుండెను. ద్వితీయవివాహమున నారాయణరావు కమలను భార్యగా గ్రహించుటయే, విమలవిషయమున నాతఁడతి మనఃక్లేశ బాధితుఁడగు గతిఁ గల్పించెను.

౨

కమల, కాపురమునకువచ్చి యొకసంవత్సరమైనది. విమల, యిప్పు డారేండ్ల యీడుగలది. కండ్లకలక గలవానిచూపునకు దీపమువలె కమలకు విమల యున్నచోఁ గంటగింపు ప్రారంభమయ్యెను. ఈసడించుట మెండయ్యెను. భర్తసమక్షమున విమలపై నెంతో ప్రేమనటించుట—అతని పరోక్షమున నా బిడ్డను చంపుదమనునంతటి తీవ్రభావము వహించుట, కమలకు సహజగుణములుగ మారెను. ఆవులించినఁ బేవులులెక్కబెట్టు తెలివిగల నారాయణరావీటక్కులాడి జాడలెఱుంగుటలో నొకింత యేమఱుపాటు వహించెను. అయినను విమల సంరక్షణ విషయము దలంచుకొనునపు డాతని విచారసాగరము మేరమీరుచుండెను. హృదయము నీటికంటెను బలుచనగుచుండెను. ఎట్టులైననేమి. తల్లియొక్కస్థానమునకువచ్చి నిలిచెఁగావున విమలసంరక్షణభారమున గొంత, దన ద్వితీయకళత్రముపై మోపక రావునకుఁ దప్పదయ్యెను. ఇంటినౌకర్లలోనెల్ల వెంకి యనునది చిరకాలమునుండి వీరియింట నున్నది. సుందరి చిట్టచివరయూర్పువిడచుతరి యీ వెంకి

761

చేతిలో విమలచేయిఁ బెట్టించి కన్నులుమూసెను కమలకును నీవృద్ధపరిచారికపై నమ్మక మెక్కుడు. ఆమె యెన్నెన్నియో సంభాషణ శ్రీదాసితోఁ జేయుచుండును. ఆసలఁగొల్పును. పసదనము లొసంగును. రహస్యాలోచనములు సలుపుచుండును. కమల రహస్యాలోచనముల వినునప్పుడెల్లను సుందరి మందహాసవదనమున దాని మానసిక వీధిని దోఁచి "వెంకీ! బిడ్డను కాపాడుము" అని పలికినట్లు తోఁచుచుండును. నారాయణరావుగారి గృహమున నిప్పుడు "విమల" నుగూర్చిన విచారముదప్ప నొండొక్కకొఱంత నెంతయుఁగానరాదు. విమలనుగూర్చి యొక్కొక్క విచార మొక్కొక్కరిని-వారియింట నున్నవారిని-ఆవేశించియున్నది. కాలచక్ర మిట్లే పరిభ్రమించుచున్నది.

౩

"నాన్నగారు రాగానే చెప్పుతాను—నన్ను కొట్టితిరిగాదూ! నాకు లక్కచిట్టి యియ్యకుండా దాచిపెట్టుకున్నారుగాదూ! ఆడుకుంటూ కక్కియంటే తోసేశావుగాదూ! ఎంకీగూడా నేను మెట్లమీదినుండి పడిపోతుంటే పట్టుకోలేదుగాదూ! మానాన్నగారు నాకు అన్నీ యిప్పిస్తారు. ఎప్పుడూ నన్ను రానీయకుండా దొంగమాటలు చెప్పుకుంటారు నాన్నా-కక్కి, వెంకీని, అని నేను చెప్పేస్తాను నాన్నగారితో. ఇక్కడ చూడండమ్మా! నాచేయి దోక్కుపోయింది. కక్కి నెట్టితే పడ్డానుగానూ—నెత్తురుగూడా వస్తున్నది—ఊ-ఊ-ఊ" అని విమల పంచభూతాలతో దన మొఱ చెప్పుకుంటూ చూచువారి హృదయము లవియునటుల వెక్కుచు నేడ్చుచుండెను. ఆదిక్కుమాలిన బిడ్డ నాదరింప నచట నెవ్వరును లేరు. ఆమె తొక్కుపల్కులయందలి తీయదనము ననుభవించువారెవ్వరు? సుందరి లేదుగద? కమల కామె సవతిబిడ్డగద? ఇట్టి యనాథశిశువులఁ గాపాడ దైవము గాక నింకెవ్వఁడున్నాఁడు? విమల యట్టులే లోలోన కుమిలికుమిలి యేడ్చుచున్నది.

అప్పటి కైదు గంటలైనది. ఎన్నిపనులుండినను అయిదుగంట లగునప్పటికి నారాయణరావు తప్పక యిల్లుసేరితీరుట అలవాటు. ఘటికాయంత్రము టంగుటంగున నైదుగంటలు కొట్టుటవిని కమల సంభాషణ ముగించి వెంకిని గృహకార్యములకు నియోగించెను. పడఁవడి విమలనుజూసి "తల్లీ! నీవేల యేడ్చెదవు? నీకేమి కోరెదవో చెప్పుము? ఈనిముసమున నిచ్చెదను. తోటలోనున్న పూవులుకోసి తెచ్చుకొందమా? ఏడువకమ్మా! మీనాన్నగారు కోప్పడతారు" అనుచుఁ జేరఁదీసి యోదార్పఁజూచుచుండెను.

విమల:—కక్కి! ఇవన్నీ దొంగమాటల్లే. అన్నీ మాయమాటలు చెప్పుతావు. నాన్నగారు రాగానే నాచేయి దోక్కుపోయిందని చెప్పుతాను" అనెను.

ఇంతలో నారాయణరావు ప్రవేశించి "నాతల్లీ! చేయి దోక్కుపోవుటేమిటి? చూపుము" అనుచు విమలను చేరఁదీసి తొడపైఁ గూర్చుండబెట్టుకొని చూచెను. ఆమె మోచేయినుండి రక్తము చెమ్మగిలుచుండెను. దానిఁగాంచి నారాయణుని కన్నుల నీరు గిఱ్ఱునదిరిగెను. విమలను ప్రశ్నించి కారణమారసెను. ఆమెకుఁ దాను దెచ్చిన దినుబండారముల నిచ్చి యోదార్చెను. కమలనుజూచి "కమలా! ఇది నిరపరాధి. లోకమన్న నెఱుంగదు. దానియం దేవియేని లోపములుండి యవి నీకు సహింపరానివైనచో నందుకుఁదగుశిక్ష నారోపర్పుము. దాని పీడ్పింపకు. ఎవరెన్నివిధముల నాలోచించినను దీనులరక్షింప పరమేశ్వరుఁ డున్నాఁడని మఱువకుము." అని చెప్పెను. అందరు వారివారి పనులయందుఁ బ్రవేశించిరి.

౪

"అంతటను బాగా వెదకితిమి. కమలాంబగారూ! పిల్లదాని జాడయేమియుఁ గానరాలేదు" అనుచు పరిచారకు లొకనాఁటి సాయంకాలము నారాయణరావుగారి భార్యతోఁ జెప్పుచుండిరి. ఆసమయముననే సరిగా రావుగారింటికివచ్చిరి. సమాచార మేమిటని కమలను ప్రశ్నించిరి. ఆమె పెద్దగ నేడ్చుచు "నేఁటి

762

"మధ్యాహ్నమునుండియు మన విమల కానవచ్చుట లేదు. నగలు పెట్టించుకొని ఆడుకొనెదనని వీథిలోనికేగెను. ఇంతవఱకు నింటికి రానందున వెదకితిమి. ఎందును గానఁబడదు. వెంకియు వెదకుటకు బోయినది. అది యింకను రాలేదు." అని చెప్పెను. నారాయణరావు నిలువునఁ గూలఁబడిపోయెను. అతనిని దుఃఖదేవత పూర్తిగ నావేశించెనని వేరుగ వివరింపఁబనిలేదు. ఇంతలో వెంకియు నింక కొందఱును ఒకగోను బట్టుకొనివచ్చిరి. ఆగోను యొక బొమ్మజెముడుపొదక్రింద నుండెననియు నచట రక్తము స్రవించినజాడ లుండెననియు వెంకియుఁ దక్కిన వారు తెల్పిరి. వాఁడా గోనును విమల తొడిగినట్లు కమల చెప్పెను. నగలకొఱ కెవ్వరో బిడ్డను జంపివైచిరని యూహించిరి. గోను దొరకిన ప్రదేశమునకుఁ బోయి నారాయణరావుగారి మిత్రులు శోధించిరి. అడుగుజాడలుగట్టి శోధింపఁజొచ్చిరి, ఏమియు ఫలములేదు. విమలకొఱకు నారాయణరావు చింతాసాగరమగ్నుఁడై విరక్తిఁగొని మంచముబట్టెను, కమలనుగూర్చి యేమేమి చెప్పవలెనో తోఁచకున్నయది, గాని వెంకిమాత్ర మానాఁటినుండియు కమలకు దాస్యముసేయ నిచ్చగొనలేదు; ఇంటనే జీవయాత్ర చెల్లించుకొనుచుండెను. ఈస్థితిలో క్రమక్రమముగ మాసములు గడచి యేండ్లు ప్రారంభించినవి.

విజయనగర కళాశాలలో యఫ్. ఏ. పరీక్షయందుత్తీర్ణులైన కన్యారత్నముల యందెల్ల సుందరి యగ్రగణ్య. ఈయమ యచట డాక్టరుగా నున్న విశ్వనాథయ్యరుగారి యభిమానపుత్రిక. ఆయనయుఁ దత్పత్ని మీనాక్షియు సుందరిని వేయికనులఁ గాపాడి పోషించుచుండిరి సౌందర్య విశేషసూచియగు "సుందరి" యను నామకరణము గూడ నామెకు వారే యొనర్చిరి. సౌందర్య, సౌశీల్య, సద్గుణ, సరస సల్లాప సమేతయగు సుందరి యందంతటను గడు నాదరము, గౌరవముగూడను. సుందరి నెదియేని గౌరవస్వతంత్ర జీవితమునందుఁ బ్రవేశ పెట్టవలెనని అయ్యరుగారి యుద్దేశము. విద్యావతియు, లోకానుభవజ్ఞయు నగు సుందరియు నట్లే లోలోనఁ దలంచుచుండెను; కాని అయ్యరుగారి సంరక్షణమునందున్న యామె స్వతంత్రించు టెట్లు? అయ్యరుగారికి స్త్రీవిద్య, స్త్రీస్వాతంత్ర్యములయెడ నభిమాన మెక్కువ. సుందరి కచట నేని యోగ్యమగు పాఠశాలయం దుపాధ్యాయినీ పదవి నేర్పాటుచేసి ఆమెయొక్క యోగక్షేమములు దాను గని పెట్టియుండి, ఆమె నొక యాదర్శయువతీమణిఁగ దయారుచేయ అయ్యరుగా రువ్విళులూరుచుండిరి. ఆయనకు సంతానములేదు. సుందరిని దమ ప్రాణాధికగ నయ్యరు నాయన భార్యయు ప్రేమించుచుండిరి. సుందరి విశ్లేషమును మీనాక్షమ్మ యోర్వఁజాలదు. కాని విశ్వనాథుని బోధవలన నామె సమ్మతించెను. విశ్వనాథుఁ డాయాటంకము దీఱిన యనంతరము సుందరినిగూర్చిన తన యభిప్రాయమును సుజ్జనులగు తన మిత్రులతోఁ జెప్పెను. వారిలో విజయనగర కళాశాలయందలి ప్రధానోపాధ్యాయుఁ డొక్కఁడు. ఒకనాఁటి సాయంకాల మయ్యరుగారు భార్యా సహితుఁడై సుందరితోఁ బ్రసంగించుచుండ నాయుపాధ్యాయుఁ డచటికి వచ్చెను. ఆయన సుచితపీఠమున గూర్చుండఁజేసి విశ్వనాథుఁడు కొంత ప్రసంగించిన యనంతర ముపాధ్యాయుఁడు జేబునుండి యొకయుత్తరమునుదీసి అయ్యరుగారి కిచ్చెను. దాని చిరునామా వ్రాతచూచి అయ్యరుగారు "సార్! ఇది మనకాంతారావు పంతులుగారు వ్రాసినది. విశేషములేమైనఁగలవా?" అనుచుఁ జదివెను. చదఁబడి సుందరినిఁ జూపుచు నుపాధ్యాయునితో "పంతులుగారూ! కాంతారావుగృహమున్న మాగృహమే. వారు మనకు ఆప్తులు. మాబిడ్డ వారింటనున్నను మాయింటనున్నట్లే. అభ్యంతరములేదు. సుందరియు నిందుకు సమ్మతించును." అనుచు సుందరినిజూచి "తల్లీ! పోయిననెలలో మనయింటజరిగిన గానసభల సందర్భమున కాకినాడనుండి ఇక్కడికివచ్చి పది పదునైదుదినములు మనకు ఆతిథ్యమునుండిరే— వారే కాంతారావు పంతులుగారు—ఈజాబు వారే

వ్రాసిరి. నీవు చదువుము. సంగతులు తెలియును." అని యా జాబును సుందరి చేతికిచ్చెను. ఆమె చదువుకొనసాగెను. చదివినకొలఁది సుందరిముఖమున సంతోషచిహ్నము లుదయింపసాగెను. ఉపాధ్యాయుఁడు "అయ్యా! ఈలేఖ తమ యొద్దనే యుంచుఁడి. ఆలోచించి తమ యభిప్రాయమును దెలిపిన వెంటనే నేను సిద్ధముగనుందును. సెలవుగైకొందు"నని వెడలిపోయెను.

౬

"లక్ష్మీ! సరస్వతీ! అల్లరి చేయుచున్నారు గారూ? ఇక మీ అల్లరి సాగదులెండి. వదినలమ్మగారు రాత్రిబండిలో వచ్చుచున్నారు." అని కాంతారావుగారు కుమార్తెలను మందలించుచున్నారు. ఆయన భార్య రంగమ్మవచ్చి "రాత్రి 8 గంటల బండికేనా వారువచ్చేది? ఎంతమంది వచ్చెదరో? అయితే వంటచేసి యుంచుమందురా?" అనెను. కాంతారావు "ఔను, ఎనిమిదిగంటలబండికే వస్తారు. అక్కడ కాలేజీలో టీచరు బాబురావుతో గూడా ఆమెను యిక్కడికి పంపెదమని విశ్వనాథయ్యగారు వ్రాశాడు. మనము వ్రాసినజాబు బాబురావు, డాక్టరుగారికి యిచ్చారట. బహుశా ముగ్గురో నలుగురో వస్తారు. వంట చేయవలసినదే." అని చెప్పెను. తరువాత కాంతారావుతన, కుమారుఁడు కమలాకరుని పిలిచి "బాబూ! రాత్రి ఎనిమిదిగంటలబండిసమయమునకు మన మోటరుకారుతో నీవు స్టేషనుకువెళ్లి, బాబూరావు వగయిరాలను తీసికొని రావలసినది. విశ్వనాథయ్యగారు వ్రాసిన జాబు చూస్తివిగదా" అనెను. కాంతారావు కాకినాడయందలి సంపన్నగృహస్థు. ఈయనకు ఆంధ్రదేశీయ, జాతీయ సంప్రదాయములయం దభిమానము. కావున విదేశీయపద్ధతులపై గాక మనజాతీయనియమములకు లోఁబడి తన కూతుండ్రగు లక్ష్మీసరస్వతులకు విద్య నభ్యసింపఁజేయ గోరియుండెను. యోగ్యురాలగు నుపాధ్యాయినినిఁ దనయింట నునిచికొని తన బిడ్డలకు విద్యఁజెప్పింపఁ దలంచి యందుకై యత్నించుచుండెను. తన యభిప్రాయమును విజయనగరమునే బాబురావుగారికి వ్రాయ వారద్దానిని అయ్యరుగారి కిచ్చిరి. సుందరి అంగీకారమును బొంది విశ్వనాథయ్యగా రామెను బాబురావుగారిని తోడిచ్చి కాకినాడకు బంపుచున్నామని కాంతారావుగారికి వ్రాసెను. మనము విజయనగరముఁ జూచిన సుందరియే కాకినాడకు కాంతారావుగారింటికి ఉపాధ్యాయినిగా రానున్నది. కమలాకరుఁడు కాంతారావుగారి కుమారుఁడు. ఇతఁ డిప్పుడు న్యాయవాద (ప్లీడరు) పరీక్షకు జదువుచున్నాఁడు, కమలాకరుఁడు ఈకథ మొదటిప్రకరణములో మేము జెప్పిన న్యాయవాది నారాయణరావునకు ప్రేలువిడిచిన మేనయల్లుఁడు. బంధుగులు గావున విమలనుగూర్చిన విచార మీకాంతారావు కుటుంబమునుగూడ ఘోరదుఃఖసముద్రమున ముంచివైచెను. దానికిఁ గారణమున్నది. నారాయణరావు ప్రథమభార్య సుందరమ్మ జీవించియున్న రోజులలో విమలను కమలాకరునకిచ్చి వివాహముజేసి వియ్యమంద సుందరమ్మ—రంగమ్మలు, ముచ్చటలతో మురియుచుండిరి. అది వమ్మయ్యెను. క్రమముగా విమల పేరును మఱచి అందఱును దుఃఖమునణచుకొనిరి.

౭

సుందరి, బాబురావు, ఒకదాసి, ఒక సేవకుఁడు రైలునుండి దిగిరి. కమలాకరుఁడు వీరినెదుర్కొని మోటారులోఁ గూర్చుండఁజేసి కారునడుప డ్రైవరు నాజ్ఞాపించెను. సుందరి కాభరణములులేవు. సహజసౌందర్యవతి. ఆమె సొగసుదనమును కొనితెచ్చుకొన వగల్యములేదు. బంగరుచాయమేను, గుండ్రని మొగము, సోగలైన కన్నులు, పెన్నెఱులు. చంద్రబింబమువలె నామె నెమ్మోము చూపర కాహ్లాదము గల్పించుచుండును. బాబురావుతో మాట్లాడుచుండెనే కాని కమలాకరుఁడు సుందరిని సందుసందున జూచుట విడువలేదు. బహుకాలమునాఁ డెడబాసిన ప్రాణసమమగుచుట్టమును గాంచినంతయానంద మా కమలాకరునకు జనించెను. కమలాకరుఁడు దనపైఁ బరగించు చూడ్కుల లాకునకు మోహించుచు

764

వాల్చి సిగ్గున సుందరి తెలియనట్లు నటింపఁజొచ్చెను. కాని ప్రథమదర్శనమాత్రముననే నూత్న వరిచయ సంశయమును దొలంగఁ ద్రోచికొని యొండొరుల చూపులు సాహసించి సమ్మేళనము గాంచక పోలేదు. ఇది దైవికమా? కపటనాటకసూత్రధారి యగు పరమేశ్వరునకే దీని పరమార్థము తెలియవలె. ఇంతలో మోటారు కాంతారావుగృహము ముందఱ నిలిచెను. ఆ దంపతులు అతిథుల నతిగౌరవముతో నెదుర్కొని మర్యాదల గావించిరి. మఱునాఁడు బాబురావు వెడలిపోయెను. సుందరి యుపాధ్యాయిని యయ్యెను.

౫

"అన్నయ్యా! నేడు నీ మేనల్లుని పుట్టినరోజు పండుగు. నన్ను చంపుకున్నంత ఒట్టు– నీవూ ఒదినే తప్పక రావాలె. ఎల్లకాలము యీలా అయితే మొగవాడికి నేను ధైర్యం చెప్పగలనా? ప్రాప్తము లేదు. పోయింది. ఏండ్లు గడిచాయి. అపఖ్యాతి వచ్చిందని ఆవిడ బెంగపెట్టుకొని దిగనారసిల్లి మంచము పట్టిపోతూంది. చెట్టుబాగుంటే కాయలు కాయవా? వెఱ్ఱిమాని తప్పక మీరు రావాలె. ఈవూళ్లో నీకు నేనూ—నాకు నీవూ—తల్లితోడూ ఇంకెవరైనావున్నారా? ఇన్నేండ్లవలె కాదు. నీవు రాకపోతే నాకడుపులో చురచురలోస్తుంటుంది. మామయ్య రాలేదేమని కమలం అడుగుతాడు. నీవు వస్తానని చేతిలో చేయివేస్తే నేను వెళతా. లేకపోతే నేనుగూడా పోను. యిక్కడే పడివుంటా" అని రంగమ్మ నారాయణరావుతో ననెను. "నాతల్లీ! వి-మ-లా—అయ్యో! కాదు—కాదు—గం-గా-వ—చ్చెద. పొమ్మ. తప్పను" అని నారాయణరావనెను. అటులే కాంతారావు నారాయణరావు భార్యచే వాగ్దానముపొందెను. కాంతారావు రంగమ్మ వెడలిపోయిరి. నేఁడు కమలాకరుని పుట్టిన రోజు పండుగు. బంధుగులందఱ నాహ్వానించినారు. విశ్వనాథయ్యగారు దంపతులు వచ్చెదమని చెప్పినారు. సుందరి యుత్సాహమును వివరింపఁబనిలేదు. కమలాకరుఁడానాఁడు ధరించుటకు సుందరి తాను స్వయముగఁ గుట్టి మంచిదుస్తుల సిద్ధము చేసెను.

౬

"నా చిట్టితల్లీ! విమలా! రావేమి? నన్ను పెదరింపవేమి? ఎందుఁబోయితివి? ఏలోకమున నుంటివి? నీవు ధన్యవు. నిను గన్నతల్లి ధన్యురాలు. నేనే మహాపాపిని. నీపాలిటి కాళరాత్రిని. నాబిడ్డా! నామీఁది నేరములు నాన్నగారితో జెప్పి కొట్టింపనని జంకించుటేగాని యెన్నఁడును చెప్పి యెఱుఁగవు. అంత చిన్నతనములోనే నీకా గొప్ప ఉదారగుణము ఎట్లువచ్చెనో తల్లీ! బ్రదుకుటకు రోజులు లేవనియా? నేను బ్రదుకజాలను. నీ వున్నచోటికి వచ్చెదను. రమ్మ. నన్ను కౌగిలింపుము" అని కమల దీనాతి దీనముగ దుఃఖించుచుండెను. దుఃఖించి దుఃఖించి తుదకు పరవశరాయె మొదలు తెగఁదీసిన కదళీవృక్షము వలె నామె భూమిపై నొక్కపెట్టునఁబడెను. ఆ చప్పుడువిని నారాయణరావు వచ్చి యామె నోదార్చి తేర్చెను. కమల తెలివిఁగాంచి నారాయణరావు పాదముల వ్రాలి "మహానుభావా! మీరు నాపాలిటి కీశ్వరులు. ఈశ్వరుని యపరాధక్షమను వేడునట్లు నేను మిమ్ము అపరాధక్షమను వేడుచున్నాను. నేను మహాపాపినిని. కొన్నియేండ్లనుండియు నా పాపఫల మనుభవించుచున్నాను. మీ దుఃఖములకన్నిటికిఁ గారణము నేను! నే నడుగుపెట్టఁబట్టియే ఆనందనిలయమగు మీ యిల్లు దుఃఖసదనమైనది. నావలననే మీబిడ్డ మిమ్మెడబాసినది. నేనీ సశరీరనరకము ననుభవింపజాలను. నాకు సెలవిండు. క్షమించితినని మీరన్న జాలును. నే నికమీకు గానరాను. నాబిడ్డను గలసికొందును" అని గోడు గోడున నేడ్చెను. నారాయణరావు అదివిని "కమలా, అంతయు పూర్వకర్మఫలము. మనము కర్తలము గాము. కావున నా దుఃఖమునకు నీవుగాని నీ దుఃఖమునకు నేనుగాని కారణము గాము. ఎవరి కర్మము వారిది—నేఁడు మా సివతల్లి కుమార్తె

765

గంగమ్మకు మనము చేసిన వాగ్దానముచెల్లించి రేపు ఉదయమున బయలుదేరి శ్రీ కాశీక్షేత్రమునకేగి యచట జీవితశేషము వెల్లించుదము. మన యావదాస్తియును ఏకళాశాలకైనను దానపత్రము వ్రాసి యిత్తము. నేడు కాంతారావింట మనబంధువుల నందఱ నొక్కమారి సందర్శింతము. ఈ దినము మనకు బరమపవిత్రదినము. కావున సందియము మాని నాతో బయలువెడలుము. మోటారు దెప్పింతును" అనియెను. ఆమెయును సమ్మతించెను.

౧౦

కాంతారావుగారింట నేఁడు బ్రహ్మానందము నిండియున్నది. భోజనములైనవి. బంధువులందఱు నొకచోట గూర్చుండి యిష్టాగోష్ఠిచేఁ గొంతప్రొద్దు గడపిరి. ఆడువాండ్రందఱు గూర్చుండిన చోట సుందరి సంగీతపుపెట్టె (గ్రామఫోను) పాటలు పాడించుచున్నది. కమల యెడతెఱపిలేక సుందరినిజూచుచు గ్రుడ్లనీరు రెప్పల నప్పళించుచున్నది. విశ్వనాథయ్యరు — కాంతారావు ప్రసంగము సాగించిరి. మీ రరవవారుగదా? తెలుగుపిల్ల నేలసాకితిరని కాంతారావు ప్రశ్నించెను. అదివిని అయ్యరు "రావుజీ! నన్నేమియు ప్రశ్నింపవలదు. విజయనగరపరిసరముల నొకతోటలో నొకగుడిసెనుండి యొకబాలిక రోదనధ్వని, వినవచ్చెను. షికారుకేగిన నే నాతోటలోఁ బ్రవేశించిచూచితి. ఒక వృద్ధుఁడు చచ్చిపడియుండెను. వానిప్రక్క నొకబాలిక కూర్చుండి యేడ్చుచుండెను. అచట శోధింప నొక యుత్తరమున్నది. ఆ యుత్తరమును బాలికను నేను దీసికొని యింటికిఁబోయి నా సేవకులచేత నా ముసలివాని శవమునకు సంస్కారము గావింపఁజేసితిని. ఆయుత్తరము నా చేతిపెట్టెలోనున్నది. అది యొక స్త్రీచే వ్రాయబడినది" అని అయ్యరు దన చేతిపెట్టెను దెఱచి యొకయుత్తరమును దీసి కాంతారావున కిచ్చెను. ఆయన యిట్లు చదివెను.

"బాబయ్యా! ఇది యొక దిక్కుమాలినబిడ్డ. నా మొఱగుజొచ్చినది. ఒకానొక మృత్యుదేవతనుండి దీనినిదప్పింప నాతరముగాలేదు. కుదకట్లో నీ యొద్దకు మన బుల్లివానిద్వారా పంపుచున్నాను. పదిలముగా కాపాడుము. ఇది నాబిడ్డ. నీబిడ్డ. కావున రక్షింపుము. తోటవెలుపల రానీయకుము. జాగ్రత్త. ఇంతే దండములు. ఇది బాపనవారిబిడ్డ. నీనీళ్లు యివ్వకుండా బ్రదికింపుము." రంగమ్మ.

కాంతారావు చదివిముగించెను. అది విని నారాయణరావు దేహము గగుర్పొడిచెను. బాపనవారి బిడ్డయనియు, దిక్కులేనిదనియు యుత్తరముండుటచేత బిడ్డలులేని నేను సుందరని పెంపుడుకొమరితగా నుంచుకొని పెంచి పెద్దదానిఁజేసితిని. సుందరి యను పేరు మేమే యామెకుఁ బెట్టితిమి. ఆమెకు లోకానుభవము, స్వతంత్రత, అలవడుటకై యిపుడు మీ చేతులలో నామె నుంచినాను. ఇది యామె వృత్తాంత"మని డాక్టరుగారు కాంతారావుతోఁ జెప్పిరి. నారాయణరావు మెల్లగా లేచి స్త్రీలున్న స్థలమునకేగి సుందరినిఁ జూచుచు గొంచెముసేపు నిలిచి యశ్రుకణములు దుడిచికొనుచు మరల నీవలికి వచ్చెను. ఆతని దీనవదనమును గాంచి రంగమ్మ కంటఁ దడిపెట్టెను. "నేను చచ్చిపోయి విమల బ్రదికియుండినచో వారి కిట్టి దుఃఖము గలిగియుండదు. విమల మొకట్లు అన్ని సుందరమ్మగారి ముఖములో నున్నవి. అది చూచి యేమో జ్ఞప్తికివచ్చి గుండెపగిలిపోయి వారల్లాడిపోవుచు లోలోనగుములుచున్నారు! ఎంతపాపిని! ఎంతటి దుష్టురాలను. అయ్యో — నా తల్లీ! విమలా! రావమ్మా. క్షమించవమ్మా. నన్ను కౌగిలించి పోవమ్మా — వి — మ — లా — విమ — లా — రా — రా — నో" యనుచు కమలమ్మ స్మృతి దప్పి పడిపోయెను. గంగమ్మగారి ప్రార్థనపై సుందరి పెట్టెపాటలు పాడించుట చాలించి కమలమ్మ కుపచారము సేయుచుండెను. ఈ దృశ్యమునుజూచి అందఱును గంట దడిపెట్టిరి. నారాయణరావు జీవచ్ఛవమువోలె బడియుండెను. అప్పటికి సాయంకాల మైదుగంటలైనది.

౧౧

"అయ్యా! కాంతారావు పంతులుగారూ! నేను నారాయణరావు పంతులుగారింట పూర్వపు సేవకురాలు వెంకి రెండవకొడుకును. నా పేరు బుల్లెయ్య. మాయమ్మ యిపుడు చావ సిద్ధముగనున్నది. నారాయణరావు పంతులు గారిని ఒకసారిచూచి ప్రాణము విడువవలెనని తహతహపడుచున్నది. వారిచట నున్నారటగారూ! దయచేసి పంపండి" అని యొక శూద్రయువకుఁడు అడావిడిగా బరువెత్తివచ్చి కాంతయ్యతో ననెను. వెంటనే కారు సిద్ధముచేయించి నారాయణరావును కమలాకరునితోఁగూడ కాంతారావు వెంకి యింటికిఁబంపెను. వెంకిని పాఠకులు మఱచియుండరు. కమలాంబగారు తనకొసంగిన బహుమానధనముతోఁ గాలక్షేపము చేయుచున్నది. కాని హృదయశల్యాయమానమగు బాధ—మనోవ్యాధి—యేదో వెంకి నావేశించి దానిని మంచము పట్టించినది. అది యిపుడు మరణావస్థయందుండి తన హృదయవేదనను రావున కెఱిగించి క్షమాపణవేడి చావఁదలంచి నారాయణరావుగారి నిమిత్తము తన కొడుకును బంపించినది. దీనదయాళుఁడగు రావు వెంకిపైగల యాదరమున దానిజాడ నిశ్చయించి బయలుదేరిపోయెను.

౧౨

నారాయణరావు—ఆయనను అనుకొని కమలాకరుడు వెంకియింటిలో నొకచాపమీద గూర్చుండిరి. వెంకి యొకచాపపై బరుండి రావునుజూచి "నా బాబూ! దగ్గరకు రమ్మ"నెను. ఆయన వెంకిని సమీపించెను. "ఆ పున్నెపుపాదాలు యీలాగెట్టండి బాబూ" అనుచు వెంకి రావుపాదములపై దన మొగముఁజేర్చి కన్నీరు మున్నీరై పాఱ వెక్కుచు "నాతండ్రీ! నీ—బిడ్డను—నేను ఎడబాపితిని—చంపలేదు. ఉన్నది. కారణము నేను చెప్పను. పండుపంటికాపురము. ఎక్కడున్నా—బతుకుతుందని పంపించా—యిజయనగరానికి—నా చినజాబు దగ్గరికి—తోట్లకాపరి. ఆయన చచ్చిపోయాడు—యిమలమ్మ ఆనాయులుందేమో యెతికించాలె—నన్ను క్షమించాలె—నాబాబూ—ఆమెను రచ్చించాలెనని చంపేశా. పిన్నదొరసాన్ని యేమనొద్దు. దణ్ణం—దణ్ణం—పాపాలునిలవ్వు—పోతున్నా—పో—తు—ఊం" అనెను. వెంకి నిర్జీవయయ్యెను. నారాయణరావు నిర్విణ్ణుఁడయ్యెను. విశ్వనాధుడు చెప్పిన మాటలు—వెంకమ్మ యుత్తరములోని కబుర్లు—వెంకి తన సమక్షమున బల్కిన వాక్యాలు విన్నాడు కమలాకరుఁడు. సుందరి కీకథ సూటియగు నాయని తలంచుచున్నాఁడు. నారాయణరావు తన జేబునుండి పదిరూపాయిలు వెంకికొడుకునకిచ్చి మరల మోటారునెక్కి కమలాకరునితో కాంతారావుగారింటికి జేర బయలుదేరెను.

౧౩

"అట్టే నాకు జ్ఞప్తిలేదు. నేను తోటరాతదగ్గరికి వచ్చేటప్పటికి పూర్వము నన్నందరు "విమలా" యనుచు నే పిలుచుచున్నట్లు జ్ఞాపకము. ఏమిగోలో ఎన్నేండ్లో నాకేమి జ్ఞాపకము! నన్నెందుకు వేధిస్తారు? నా తండ్రిగారు డాక్టరు విశ్వనాధయ్యరుగారు, నా తల్లి మీనాక్షమ్మగారు. అరవ్వారలో—తెలుగువారలో ఎవరైతే నేమి? ఎవరు బ్రదికించారో—ఎవరు విద్యాబుద్ధులు చెప్పించారో—వారే నాతల్లి-దండ్రీ. ఇప్పుడీ రంగమ్మ అత్తయ్యగారింత అన్నము పెట్టుచున్నారు. వారిల్లే నాయిల్లని యిప్పుడను కొనుచున్నాను. దైవ మింకెన్ని రంగములలో యీ పాత్ర నేకాలమున నేరీతిని నటింపజేయ దలంచియున్నాఁడో ఎవరెరుంగుదురు. నా పూర్వచరిత్ర నాకు జ్ఞప్తిలేదు. నన్ను తేఱచకండి, మ్రొక్కెదను" అని సుందరి, వివిధరీతుల ప్రశ్నించుచున్న స్త్రీబృందమునకు, బదులిచ్చుచున్నది. కమల మెల్లగలేచి సుందరినానుకొని కన్నీరు గార్చుచున్నది. విమలాస్మరణముదక్క కమల కింకొక తలంపులేదు. కాంతారావు—విశ్వనాథుల సంభాషణము—ఈ త్తరములో సంగతులు అచ్చటివారికెల్ల దెలియ[illegible] సందఱకు భావములపై భావములు జనించి యొక్క మొగిని

767

సుందరిని ప్రశ్నింపసాగిరి. నారాయణరావుగారు వచ్చిరి, వెంకి మరణావస్థలో జెప్పిన మాటలన్నియు కాంతారాయవిశ్వనాథాదులకు కమలాకరుడు వివరించెను. కాంతారావించుక యోజించి "ఇంక సందేహమేల? లెండి. మన మచటికేపోవుదము" అనుచు లేచెను. ఆయనతో దక్కినవారు లేచిరి. స్త్రీలున్న చోటికి బోవలెనని వారి ప్రయత్నము. కాంతారావు మొదలగువారు వెలుపలిహాలుదాటి మండువాద్వారమువద్దకు వచ్చిరి. ఆద్వారమున కెదుట మండువాకు ఆవలివలండములో స్త్రీలు కూర్చుండియున్నారు. రంగమ్మగారు సుందరిని జూచి "అమ్మాయీ! పెద్దదానవుగాన అడుగుచున్నాను. నీకు జ్ఞప్తియున్నంతలో నీ తల్లి పేరుగాని—తండ్రి పేరుగాని చెప్పలేవా?" అనెను, సుందరి ఆమాటవిని "అత్తయ్యగారూ! తెలిసీతెలియని అవివేకపు మాటలాడిన లోకము నవ్వదా? తోటశాలదగ్గరికి నేను వచ్చేసరికి ఆరో—ఏడో—ఏండ్లట. మాపూరు బాగా తెలియదుగాని మా అమ్మ పేరు కమలాంబ—ఆమె నన్ను పెంచింది" అనునప్పటి కామె యొడిలోఁ దలపెట్టి పరుండియున్న కమలాంబ "అయ్యో! నాతల్లీ! కమలా! నన్ను అమ్మ అనెదవా? నేను కిరాతురాలను—నా చిట్టికూనా—ఎచటనుంటివే"-అని బావురుమనెను. ఆమె స్థితిఁగాంచి సుందరియు ధైర్యముజ్జగించి కన్నీరుగార్చెను. ఈదృశ్యము నావలివలండమువద్ద నిలిచి చూచుచున్న మగవారుగాంచి విస్మయులైరి. నారాయణరావు వారిలో నిలువకజాలక యొక్కపెట్టున బరువిడి సుందరిని సమీపించి కౌగిలించికొని "నా కన్నతల్లీ! సుందరీ! విమలవుకావా? నీవు?" అనుచు నానంద దుఃఖ ఆశ్చర్యమగ్నమానసుఁడై సుకుమారియగు నాసుందరి మస్తకమున దన తల మోడ్చి కన్నీటిధారలచే నామెను దడపుచుండెను. విశ్వనాథయ్య రదిగాంచి "అరరే! దైవసంఘటన మిట్టిదిగదా! తండ్రియు బిడ్డయు జిట్టచివర కొక్కచోటున జేరిరి. ధన్యుఁడను. నారాయణరావుగారూ! మీసొత్తు మీకు జేరినది. అమ్మా! సుందరీ—కాదు-కాదు—విమలా! నీ తల్లిగారికి మ్రొక్కు. ఆమె అదలుదీర్పుము. దుఃఖమునననయుచున్న నీతండ్రి పాదములకు నమస్కరింపుము" అనెను. సుందరి అటులే చేసెను. కమలాకరునికి, అతని తల్లిదండ్రులకు గలిగిన సంతోషమునకు మేరయుండునా?

సమాప్తి

నారాయణరావు ప్రార్థనపై మీనాక్షీ విశ్వనాథులు విమలను కమలాకరునకిచ్చి పాణిగ్రహణము గావించిరి. కమల, విమలనుఅల్లుని క్రింద నడువనీయక ప్రేమించుచుండెను. మరల నారాయణరావు భవన మానందనిలయమయ్యెను. తల్లిదండ్రుల అత్తమామల లాలనపాలనల సుఖించుచు విమలా కమలాకరులు గృహస్థధర్మము నవలంబించి సౌభాగ్యాంబుధి నోలలాడుచుండిరి.

శాంతి

యడవల్లి రామమూర్తిగారు

ప్రేయసీ! నీదు వికసితనయనయుగము
నుండి వెడలెడు యమృతసుకుపులకట!
నాదుయలసిన హృత్సీమ నదిమిపట్టి
సేదదేర్చెడుగాదె, నీశీలమేమొ!
కాంతు నీవదనమం దొక్క కాంతిరేఖ,
శాంతిగూర్చెడు నీమేనుకాంతులకట!

నాదు నిస్సారజీవనవీధియందు,
విహారణంబొనరింపగా సహానమందు.
నిర్భరంబగునాజీవనిలయమందు
కాంతు నేనొక్కయుత్సాహకారణంబు
భానుకిరణాలయనలేతుపల్లవంబు
హేమకిరణంబు వెన్వెంట నెమకునట్లు.